క్లుప్తంగా

మాజీ మంత్రి పరామర్శ



గట్టు: మాజీ మంత్రి డీకే సమరసింహారెడ్డి చాగదొణ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జంగం శివయ్యతో పాటుగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం జంగం శివయ్య కుమారుడు కుమారస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తప్పుల తడక జాబితాలను సవరించాలి



పాన్‌గల్: అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితాల తప్పుల తడకను వచ్చే ఎన్నికలకైనా సవరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కేతేపల్లిలో వారు మాట్లాడుతూ జిల్లాలోని చాలా గ్రామాల్లో చనిపోయిన వారి పేర్లు, వివాహం జరిగి అత్తగారింటి వెళ్లిపోయిన ఆడ పిల్లల పేర్లు తొలగించలేదన్నారు. మరికొందరివి రెండు నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్నాయన్నారు. ఈ విధంగా ఉండటం వలన దొంగ ఓట్లు పోలయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరికొందరు నూతనంగా దరఖాస్తు చేసుకున్నా.. వారి పేర్లు జాబితాలో నమోదు కాలేదని విమర్శించారు. ఓటర్ జాబితా అసమగ్రంగా, గందరగోళంగా ఉన్నాయన్నారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఓటరు జాబితా తప్పుల తడకగా ఉందన్నారు. ఈ తప్పులను వచ్చే పార్లమెంటు, స్థానిక ఎన్నికల వరకైనా సరిదిద్దాలని కోరారు. సమావేశంలో పెద్ద హన్మంతు, లక్ష్మీనారాయణ, కాకం చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ దాడి హేయమైన చర్య

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని హనుమాన్ నగర్‌లో కల్వకుర్తి మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు బొమ్ము ఆంజనేయులుపై మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం దాడి చేయడాన్ని ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు ఖండించారు. బుధవారం కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులతో కలిసి బాధితుడు ఆంజనేయులు మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ అకారణంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ తనపై దాడి చేశాడని బాధితుడి ఆరోపించారు. మాజీ వైస్ ఎంపీపీపై దాడిని నిరసిస్తూ బుధవారం కల్వకుర్తి పట్టణంలో ఆర్యవైశ్యులు వ్యాపార వాణిజ్య సముదాయాలను మూడు గంటలపాటు మూసి వేసి నిరసన వ్యక్తం చేశారు.

గడ్డివాము దగ్ధం

పెద్దకొత్తపల్లి: మండలంంంంలోని ముష్టిపల్లి గ్రామానికి చెందిన నన్నయ్య పొలంలో గడ్డివాము ఏర్పాటు చేశారు. బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పుపెట్టారు. గమనించిన చుట్టుపక్కల రైతులు బాధిత రైతుకు సమాచారం ఇచ్చారు. బాధితుడు ఘటన స్థలానికి చేరుకునేలోపే అగ్నికి ఆహుతి అయ్యింది. సుమారు రూ.20 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు. 29కెఎల్‌పి201 అగ్నిప్రమాదంలో కాలిపోతున్న గడ్డివాము

పాలిథీన్ కవర్‌లతో కూరగాయల సాగు



పెద్దకొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల రైతులు పాలిథీన్ కవర్ల కూరగాయల సాగుపై మక్కువ చూపుతున్నారు. మండలంలోని సాతాపూర్, చెన్నపురావుపల్లి, చిన్నకార్పాముల, కల్వకోల్ గ్రామాల్లో రైతులు కూరగాయలు సాగు చేపట్టారు. పాలిథిన్ కవర్‌లను ఏర్పాటు చేసుకొని మధ్యమధ్యలో రంధ్రాలు ఏర్పాటు చేసి డ్రిప్ సౌకర్యం ద్వారా మొక్కలకు నీరు అందిస్తున్నారు. నీటి తేమశాతం ఆరిపోకుండ పాలిథిన్ కవర్ ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు. కలుపు మొక్కలు కూడ పెరగకపోవడంతో కూరగాయల దిగుబడి పెరుగుతుందని రైతులు వివరించారు. ఒక ఎకరాకు పాలిథిన్ కవర్లు రూ.4 వేల ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు.

ముళ్లపొదల్లో కేఎస్పీ కాల్వలు

మరికల్: కోయిల్‌సాగర్ ఆయకట్టుకు సాగు నీరు అందించే కాల్వలు ముళ్లపొదల్లో అల్లుకుపోయాయి. ప్రస్తుతం యాసంగిలో ప్రాజెక్ట్ నుంచి సాగునీరు విడుదల చేస్తే నీరు ముందుకు రాని విధంగా ముళ్లచెట్లు ఉన్నాయి. డీలేర్ పంపుహౌస్ నుంచి వచ్చిన డిస్ట్రిబూటర్ 16 కాల్వతోపాటు పిల్ల కాల్వల పరిస్థితి కూడా ముళ్లపొదలతో మూసుకుపోయాయి.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాలకు సామగ్రి
- గ్రామాలకు చేరిన ఎన్నికల అధికారులు
- ఓటర్లకు గుర్తింపు కార్డు తప్పనిసరి



గట్టులో పోలింగ్ సిబ్బంది, పోలీస్ బలగాలు

కేటీదొడ్డి: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సరితారాణి తెలిపారు. మండలం మొత్తం 35 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశామన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఓటరు ఓటు వేసి సద్వినియోగం చేసుకోవాలని ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్లు తప్పని సరిగా గుర్తింపు కార్డును పోలింగ్ కేంద్రానికి తేవాలని పేర్కొన్నారు. ఫొటో ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

గ్రామాలకు ఎన్నికల అధికారులు

అసెంబ్లీ ఎన్నికల కోసం విధులు నిర్వహించేందుకు అధికారులు సాయంత్రం వరకు అన్ని గ్రామాలకు చేరుకున్నారు. గ్రామాలలో ఎన్నికల నేపథ్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. రాయచూర్ – గద్వాల అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న కేటీదొడ్డిలో ప్రతి వాహనాన్ని పోలీసులు క్షుణంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికలకు ఎలాంటి భంగం కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఓటర్లను ప్రలోభాలకు డబ్బు, మందు, పంపిణీ చేయకుండా ఉండటానికి ఇప్పటికే పోలీసులు గ్రామాలకు చేరుకుని కవాతు నిర్వహించారు.

గట్టు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లును అధికారులు పూర్తి చేశారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు సామాగ్రితో చేరుకున్నారు. మండలంలో మొత్తం 55 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మండలం మొత్తం మీద 22,996 మంది పురుషులు, 23,776 మంది స్త్రీ ఓటర్లు మొత్తం 46,773 మంది ఓటర్లు ఉన్నారు. 27 గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అయిజ: మండల కేంద్రంలో, మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో గురువారం అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, పోలీసు అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండల కేంద్రంలో మొత్తం 54 పోలింగ్ కేంద్రాలలో 45,321 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 23,226 మంది పురుషులు, 22,093 మంది మహిళలు, ఇతరులు ఇద్దరు ఉన్నారు. మున్సిపాలిటీలో మొత్తం 26 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 22,797 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 10,208, మహిళలు 10,588 మంది ఇతరులు ఒకరు ఉన్నారు.

ధరూరు: శాసన సభ ఎన్నికలకు మండలంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలో మొత్తం 50 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి వెయ్యి మంది లోపు ఉన్న సెంటర్లకు నలుగురు సిబ్బందిని నియమించారు. అంతకు మించి ఉన్న సెంటర్లకు ఐదు మంది సిబ్బందిని నియమించారు. పోలింగ్ బూత్‌లలో విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. ఎన్నిల విధులకు హాజరయ్యే అధికారులు సాయంత్రమే బూత్‌లకు చేరుకున్నారు. మాక్‌పోల్ ఉదయం 5:30 గంటలకే ప్రారంభమవుతుందని, ఎన్నికల సిబ్బందితో పాటు పోలింగ్ ఏజెంట్లు అందుబాటులో ఉండాలని సెక్టోరియల్ ఆఫీసర్ ఎండీ జబ్బార్ తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో మొత్తం 49 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 41,370 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామాగ్రితో ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.



ధరూరు పోలింగ్ కేంద్రంలో..



గువ్వలదిన్నె పోలింగ్ కేంద్రంలో..



చిన్నతాండ్రపాడులో..

ఓటరు పత్రంలో రూట్‌మ్యాప్

- క్యూఆర్ కోడ్‌తో పంపిణీ
- బీఎల్‌ఓల పేరు, ఫోన్ నంబర్ల ముద్రణ
- ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు



పాన్‌గల్‌లో ఓటర్లకు ఓటరు పత్రాలను అందిస్తున్న తహసీల్దార్ (ఫైల్)

పాన్‌గల్: ఈనెల 30న జరగనున్న శాసన సభ ఎన్నికల కోసం మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బంది కేటాయింపు యాదృచ్ఛిక ప్రక్రియ ద్వారా పూర్తి చేశారు. దీంతో పాటుగా ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఓటింగ్ స్లిప్‌ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. ఓటరు పత్రంలో ఎడమ వైపు ఫొటో స్థానంలో క్యూర్ కోడ్ ఉంది. పోలింగ్ తేదీ, పోలింగ్ ప్రారంభం, ముగింపు సమయాలను కూడా ముద్రించారు. అదేవిధంగా కుడివైపున నియోజకవర్గం పేరు, ఓటరు గుర్తింపు కార్డు నంబరు, గ్రామం పేరు, పోలింగ్ కేంద్రం టోల్‌ఫ్రీ నంబర్ 1950లను ముద్రించారు. పత్రానికి వెనుకవైపున రూట్‌మ్యాప్ కూడా ఉంది. అందులో పోలింగ్ కేంద్రానికి వెళ్లడానికి దారి, అది ఏ ప్రాంతంలో ఉందో సూచించే విధంగా మ్యాప్‌తో పాటు బూత్ లెవల్ అధికారి పేరు, వారి ఫోన్ నెంబరును ముద్రించారు.

మండలాల వారీగా..

మండలం	పోలింగ్ కేంద్రాలు	బీఎల్‌ఓలు	ఓటర్లు
పాన్‌గల్	43	43	40,876
చిన్నంబావి	30	30	23,820
వీపనగండ్ల	28	28	21,567

86,263 ఓటర్లు

కొల్లాపూర్ నియోకవర్గంలోని పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో 86,263 మంది ఓటర్లు ఉండగా.. 107 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు 107 మంది బూత్ లెవల్ అధికారులను నియమించారు. ప్రతి ఓటరుకు పోలింగ్ స్లిప్‌ల పంపిణీపై ఆరా తీసేందుకు సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేస్తున్నారు. బీఎల్‌ఓలు ఇళ్లకు వెళ్లిన సమయంలో ఎవరైనా ఇంటికి తాళం వేసి ఉంటే వారి పోలింగ్ స్లిప్పులను పోలింగ్ రోజున కేంద్రంలో బూత్‌లెవల్ అధికారులతో ఏర్పాటు చేసే సహాయక కేంద్రంలో వారికి అందించనున్నారు. ఓటు వేసేందుకు వెళ్లేటప్పుడు ఈ ఓటరు పత్రంతో పాటు ఎన్నికల సంఘం ప్రకటించిన 12 రకాల గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒక దానిని వారి వెంట తీసుకొని వెళితేనే ఓటు వేసేందుకు అధికారులు అనుమతిస్తారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డీఎస్పీ



పోలింగ్ కేంద్రంలో పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ధరూరు: శాసనసభ ఎన్నికల ఏర్పాట్లను గద్వాల డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. బుధవారం రాత్రి 7 గంటలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. నియమించిన పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. శాంతి భద్రలతకు విఘాతం కలుగకుండా ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్ల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరు అలర్ట్‌గా ఉండాలన్నారు. క్యూ లైన్ల వద్ద ప్రచారాలు జరగకుండా చూసుకోవాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గ్రామాల్లో జనం గుంపులు గుంపులుగా ఉండొద్దని సూచించారు.

ఓటర్లకు ఇబ్బందులు కలుగొద్దు..



చిన్నపోతులపాడులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి రమణరావు


మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో పోలింగ్ కేంద్రాలు పరిశీలించి, సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు సెక్టోరియల్ అధికారి రమణరావు తెలిపారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తప్పవు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, కోదండాపురం పీఎస్‌ల పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐలు అశోక్‌బాబు, కృష్ణదేవా బుధవారం తెలిపారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, వారితో ఒట్టు వేయించినా, వాహనాల ద్వారా రవాణా చేసినా అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వచ్చే నెల 4వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఐదు మంది ఒకేచోట నిలబడి ఉండటం నిషేధమన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేయడానికి ఎలాంటి కార్యక్రమాలను చేపట్టినా లేదా ఎన్నికల ప్రవర్తన నియమావళిని దుర్వినియోగం చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రయాణం ప్రమాదకరం

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



చెన్నిపాడు-మానవపాడు రోడ్డు మార్గం దుస్థితి

మానవపాడు: మండలకేంద్రం నుంచి పలు గ్రామాలకు, మండలాలకు వెళ్లే రోడ్లపై గుంతలు ఏర్పడి అధ్వనంగా మారాయి. మండల కేంద్రం నుంచి చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చండూరు, బోరవెల్లి, పల్లెపాడు గ్రామాల మధ్య రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. బీటీ రోడ్లు ధ్వంసం కావడంతో పెద్దపెద్ద గుంతలు పడి వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడు మార్గంలో ప్రయాణించాలంటే నరకప్రాయంగా మారిందని పలువురు వాపోతున్నారు. రాత్రివేళల్లో గుంతలు కన్పించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షం పడితే అవస్థలు..

మానవపాడు మండల కేంద్రానికి ప్రధాన రహదారి గుంతల మయంగా ఉంది. వర్షం పడితే రోడ్డుపై నీటి కుంటలు తలపిస్తాయి. అవసరాల నిమిత్తం, ఆస్పత్రికి, పాఠశాలలకు వెళ్లే వారు ఈ రోడ్డుగుండానే వెళ్లాల్సి ఉంది. ఆటోలలు, వాహనాలు కర్నూల్, అలంపూర్ చౌరస్తాకు రాకపోకలు సాగిస్తుంటాయి. పదేళ్లుగా మానవపాడు, చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, అమరవాయి, పెద్దఆముదాపాడు, నారాయణపురం గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డుపైనే ప్రయాణిస్తుంటారు. ప్రమాదాలు ఏర్పడకముందే రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..



రోడ్లపై గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. చెన్నిపాడు-మానవపాడు రోడ్డు ప్రమాదకరంగా మారింది. ప్రయాణంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకోని వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– చిన్న వెంకట్రాములు, మానవపాడు

ప్రయాణించాలంటే ఇబ్బందులు..



కలుకుంట్ల నుంచి మద్దూరుకు వెళ్లే రోడ్డు మార్గం కలుకుంట్ల బ్రిడ్జి దగ్గర వాహనాదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ప్రయాణానికి సమయం వెచ్చించాల్సి వస్తోంది. నిత్యం దుమ్ము, దూళీతో ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, స్పందించి కాంట్రాక్టర్‌తో మా ట్లాడి రోడ్డును బాగుచేయాలి.

– ఆత్మలింగారెడ్డి, సర్పంచ్ కలుకుంట్ల

మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం

రోడ్లపై గుంతలు ఏర్పడిన విషయం వాస్తవమే. మానవపాడు రోడ్డుకు రూ.4కోట్లు, కలుకుంట్ల రోడ్డుకు రూ.3.40లక్షలు టెండర్ వేశారు. కానీ ఎవరూ పనులు చేసేందుకు ముందుక రావడం లేదు. రోడ్లకు నిధులు రాగానే గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– మహేష్, ఆర్‌ఎన్‌బీ, మానవపాడు

అంబులెన్స్ జాడేది?

- మండలానికి 108 సౌకర్యం కరువు
- ఆపదొస్తే ప్రైవేట్ వాహనాలే దిక్కు
- ప్రభుత్వాలు మారినా తీరని సమస్య
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలో వరుసగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల వల్ల స్థానికంగా అంబులెన్స్ (108) అందుబాటులో లేకపోవడంతో నిత్యం ప్రజలు ప్రాణాలను కోల్పోతున్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ కోసం స్థానికులు, పోలీసులు ప్రయత్నించినా.. మండలంలో ప్రభుత్వ అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాల లో క్షతగాత్రులను తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితులలో మండలంలో తక్షణ అవసరం కోసం 108 అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని ఆ యా గ్రాయాల ప్రజల నుంచి చాలాసార్లు వినతులు వస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల కోసం మొదట ప్రతి మండలంలోని ఆరోగ్య కేంద్రానికి వైద్య ఆరోగ్యశాఖ 108లను కేటాయించింది. కానీ ఇటిక్యాల మండలానికి ఈ వసతి అందని ద్రాక్షలా మిగిలిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదం జరిగితే పక్కనున్న మండలాల నుంచి 108 వాహనాలు రావాల్సిన పరిస్థితి దాపురించిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 60వేల జనాభా పైనే..

మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయతీలు ఉండగా దాదాపుగా 60వేలకు పైగా జనాభా ఉంది. ఇంత జనాభాకు ఒకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటంతో పాటు 9హెల్త్ సబ్ సెంటర్‌లున్నాయి. 108 సౌకర్యం మాత్రం స్థానికంగా అందుబాటులో లేదు. ఇక్కడ 44వ జాతీయ రహదారితో పాటు మండల కేంద్రానికి డబుల్ రోడ్డు ఉండటంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదవశాత్తు రోడ్లపై ఎమైనా ప్రమాదం సంభవించినా లేక అనారోగ్యం కారణాలతో అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా ఇక్కడ 108 సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు మండల ప్రజలు వాపోతున్నారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో సుమారు 25కిలోమీటర్ల దూరం నుంచి పెబ్బేరు, గద్వాల ఆస్పత్రులకు చెందిన అంబులెన్స్‌లు వచ్చేలోపే సగానికి పైగా ప్రాణాలను కోల్పోతున్నారని ప్రజలు వాపోతున్నారు.

అత్యవసరంలో చేరుకోని అంబులెన్స్‌లు..

మండలంలో అంబులెన్స్ సదుపాయం లేకపోవడంతో వివిధ ప్రాంతాలలో జరిగిన ప్రమాదాలకు ఇతర ప్రాంతాల నుంచి సకాలంలో అంబులెన్స్‌లు రాకపోవడంతో చాలా మంది ప్రాణాలను కోల్పోయారు. కొండపేటకు చెందిన వ్యక్తి యాక్తాపురం స్టే జీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, సకాలంలో అంబులెన్స్ రాకపోవడంతో ఘటన స్థలంలోనే అరగంట కావడంతో అక్కడికక్కడే ప్రాణాలను కోల్పోయాడు. యాక్తాపురం గ్రామానికి చెందిన వ్యక్తి బీచుపల్లి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా సకాలంలో అంబులెన్స్ రాకపోవడంతో అక్కడే ప్రాణాలను కోల్పోయాడు. మండలంలో ఎక్కడ ప్రమాదం జరిగినా ఇతర మండలాల నుంచి అంబులెన్స్‌లు సకాలంలో రాకపోవడంతో అధికంగా ప్రాణాలను కోల్పోతు న్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తక్షణమే మండలానికి అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు..



ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మొదటి నుంచి అంబులెన్స్ సౌరక్యం లేనందున మండల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో నివాసం ఉంటున్న ప్రజల పరిస్థితి మాత్రం ఎంతో దారుణంగా తయారైంది. గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లడానికి స్థానికంగా అంబులెన్స్ అందుబాటులో లేదు. దీంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. సమస్యను పరిష్కరించాలని మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదు.

– సరభయ్య, ధర్మవరం

పీహెచ్‌సీకి అంబులెన్స్ ఏర్పాటు చేయాలి



వైద్య ఆరోగ్యశాఖ తక్కువ జనాభా ఉన్న మండల కేంద్రాలకు అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించింది. అధిక జనాభా ఉన్న ఇటిక్యాల ఆరోగ్య కేంద్రానికి 108 ఏర్పాటు చేయలేదు. దీనివల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు అత్యవసర పరిస్థితులలో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్పందించి వెంటనే మండలానికి 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి.

– విష్ణువర్ధన్‌రెడ్డి, ఇటిక్యాల

ఉన్నతాధికారులకు విన్నవించాం..



మండలంలో 108 సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రా మాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చాలాసార్లు విన్నవించాం. మండల పీ హెచ్‌సీలో 108 సమస్యను పరిష్కరించా లని ఉన్నతాధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యేకు కూడా గతంలోనే విన్నవించాం. సమస్యను జిల్లా మంత్రులతో చర్చించి త్వరలోనే అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేసేలా కృషిచేస్తాం.

– డాక్టర్ రమేష్, మండల వైద్యాధికారి, ఇటిక్యాల